కథ

# సుశీల

వేదుల చిన్నవేంకటచయనులు

యూనివర్సిటీ నుంచి వస్తూ ఇంకా ఇంట్లోకి అడుగుపెట్టానో, లేదో "ఆవిడ ఫోన్ చేసిందండీ" అని దూరంనుంచే కేకవేసింది. నాకు తెలుసు, "ఎవరే?" అని నేనడిగే ప్రశ్నకు, "అదే, ఆవిడేనండీ" అంటూ, సూటిగా జవాబు రాదని, అందుకని సావకాశంగా, ఓవర్ కోటు లాకర్‌లో పెట్టి, జోళ్లు విప్పుకుని, ఫామిలీరూమ్ సోఫాలో చతికిలపడ్డాను.

"మహా అదెవరైనా లెఖ్ఖలేనట్లు ఆ నటన నాకు తెలియదనుకున్నరా?" అని నావైపు కొంటెగా చూస్తూ, తల ఆడిస్తూన్న, మా ఆవిడని మీరు చూసి తీరాల్సిందే! ఆ చూపు, ఆ వయ్యారం, ఆ చిలిపితనం! హావభావ వర్ణనా పాండిత్యం లేనివాడు, క్లుప్తంగా సైంటిఫిక్ రిపోర్టులు వ్రాసుకుపోవడమే కాని మరో ప్రజ్ఞలేని నాలాంటి కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఆ కవ్వించు కంజాక్షిని ఏం వర్ణించగలడు? నోరు తెరచుకుని అలా ఆరాధన చేస్తూ కూర్చోడం కన్నా! అదే ఓ లిబరల్ ఆర్ట్స్ ప్రొఫెసరైతే, ఓ ప్రబంధకావ్యం కాకపోతే, కనీసం ఓ పంచపద్యరత్నావళి ఆశువుగా అల్లి అర్పించేవాడే, ఆ అందచందాల ఆరాధనీయ కొంటెచూపులకి.

అలాగే చూస్తూ మరేమీ అడుగని నన్ను చూసి, చిరుకోపం వచ్చింది. "ఐతే పోనీండి. నాకేం పట్టింది. ఆవిడ అక్కడ ఎయిర్‌పోర్ట్‌లో చూసిచూసి..."

"ఎయిర్‌పోర్ట్‌నుంచి ఫోన్ చేసిందా? ఏ ఎయిర్పోర్టు? ఎంత సేపయింది వచ్చి? ఎవరది. ఎక్కడనుంచి వచ్చింది" అని ప్రశ్నలవర్షం కురిపిస్తూ, తీసుకురావడానికి సిద్ధంగా లేచాను.

"కంగారుపడకండి. ఇవాళ కాదు వస్తూంట"

"నువ్వూ, నీ చిలిపితనమూ, ఎన్నాళ్లయినా మానేవు కావు. డొంక తిరుగుడులు లేకుండా చెప్పు" అని మళ్లీ సోఫాలో చతికిలపడ్డాను.

"అలాక్కాదు. మీరు ప్రశ్నలడగండి. అన్నిటికీ సూటిగా జవాబిస్తాను. ఒట్టు. పది ప్రశ్నలైనా కనుక్కోలేకపోతే..."

పోతే, అన్నట్లు నేపెట్టిన ఫోజుని చూసి,

"ఇవాళ మీకింట్లో భోజనం లేదు. అలా చూడకండి. నేనంత కర్కోటకినేం కాదు. మీరు నన్ను హోటల్‌కి తీసుకెళ్తే, అక్కడ మీకు భోజనం"

"చూడు లక్ష్మీ, ఇవాళ్ల నేను చాలా అలసిపోయాను. నన్ను మళ్లీ బయటకి అని ఎక్కడికీ లాక్కెళ్లకు. నీకు పుణ్యముంటుంది. ఉత్త గొడ్డుచారైనా సరే. ఇక్కడే మన భోజనం. ఈ సాయంత్రానికి"

"ఐతే పోనీలెండి. మీకిష్టమైన వంకాయ సివంగి పులుసు, పెసరపచ్చడీ చేశాను. పదిప్రశ్నలలో కనుక్కోవాలి?" అని మళ్లీ ఆటపట్టించింది.

అదేదో అయిందనిపిస్తే కాని లాభం లేదని, సరే, అని ఆరంభించాను.

"మీవాళ్లా, మావాళ్లా?"

"మా వాళ్లు కాదు"

"మా దగ్గరివాళ్లా, దూరం వాళ్లా"

"అది 'రాయల్' 'మా' ఐతే, మీరే చెప్పాలి"

"సూటిగా చెప్తానని మళ్లీ ఈ తమాషా యేంటి?"

"తమాషా లేదిందులో. జాగ్రత్త. మూడైపోయాయప్పుడే" అని హెచ్చరించింది, వచ్చే నవ్వుని ఆపుకుంటూ.

మా ఆవిడతో ఇలాంటివే కాదు. ఎలాంటి పందాలైనా ఎప్పుడూ నే నెగ్గనే లేదు. ఎప్పుడూ ఎగతాళి చేస్తూనే ఉంటుంది. తను



స్కూల్‌ఫైనల్ మాత్రమే ఐతే నేనో పిహెచ్‌డి ఐనా లాభం ఏంటంటూ. తెలివి -తేటల్లో మాఆవిడదే పైచేయి అని ఒప్పుకోక తప్పదు.

ఓ పదినిమిషాలు నాతో చెలగాటాలాడాక, నువ్వే నెగ్గావు. చెప్పు బాబూ, అని నేను వేడుకున్నాక చెప్పింది. "మీ స్వప్న సుందరి, సుశీలే" అని వెక్కిరిస్తూ.

సుశీల తాతగారి ద్వారా విన్నాను. కుటుంబం వాళ్లంతా వద్దని చెప్తున్నా వినిపించుకోకుండా ఎవరినో ప్రేమించి పెళ్లి చేసేసుకుందని. మాలాగే అమెరికాకి వచ్చిందని కూడా విన్నాను. కాని మా నెంబర్ పట్టిందంటే, వాళ్ తాతగారిచ్చి ఉంటారు.

నాదే పొరపాటు. పెళ్లయిన కొత్తలో చెప్పాను. ఆలూమగల మధ్య అరమరికలు ఉండకూడదన్న అపోహతో. అప్పటినుంచీ మీ స్వప్నసుందరి అంటూ ఓ రెండుమూడేళ్లు ఏడిపించింది. తరువాత మళ్లీ ఏడేళ్లకి ఆ మాట ఎత్తింది.

అందం చూసేవాడి కనులలో ఉందన్నాడు ఓ మహానుభావుడు. అవచ్చు. మా స్కూల్ పిల్లలందరి కళ్లకీ అందగత్తెగా కనిపించిందంటే, సుశీల చక్కదనం వేరే చెప్పాలా?

సుశీలకి ప్రేమలేఖలు వ్రాసినవారసులు ఎంతమందో తెలియదు కాని ఇంచుమించు అందరూ వ్రాసేమని గొప్పలు చెప్పుకున్నవారే. నా సహాధ్యాయులంతా, నేను తప్ప. నేనే కాని అలాంటి పిచ్చిపని చేస్తినా, మా వీధిలోనే ఉన్న వాళ్ల తాతగారిచేత మానాన్నకి చెప్పించి, మానాన్న దగ్గర నాలుగు వడతాయన్న భయంతో.

అంతదాకా ఎందుకూ? తనే నేరుగా వచ్చి, చీవాట్లు కూడా పెట్టేదేమో. ఒకసారి ఓ పెంకిఘటం వెనకాతలే నడుస్తూ, ఏదో కూసేడట. అది విని సుశీల వెనక్కి తిరిగి, "ఏంట్రా కూశావ్? మళ్లీ దమ్ములుంటే నా ఎదుట కూయి" అని కాలిచెప్పు తీసిందట. తోక ముడుచుకుని వాడు వెనక్కి తిరిగి పరుగు తీశాడని అన్నారు. అంతకీ తగుదును. మాంచి సాహసం ఉన్న పిల్లే!

బహుశా సుశీల మా స్కూల్‌లో ఓ రెండేళ్లే చదివిందేమో. ఆ తరువాత వాళ్ల నాన్నగారికి బదిలీ అయితే హైదరాబాద్ వెళ్లిపోయిందని వినికిడి.

పెళ్లి అయ్యేదాకా ఏ సుందరినైనా కలగంటే, సుశీలనే! ఆ తరువాత ఎవరేనా అందమైన వాళ్లు కనబడినప్పుడు, సుశీల ఇంతకంటే అందంగా ఉండేది కదూ అనుకునేవాడిని కూడా.

నేనూ మా ఆవిడా ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లి కలిశాం. పంజాబీ సెల్వార్ కమీజ్‌లో దిగింది. చూసి పదిపదిహేనేళ్లయింది. అచ్చు ఆ రోజుల్లో సుశీలే దిగి వచ్చిందా అనిపించింది. పదహారేళ్ల బాలకుమార్తె అన్నా అనుకోవచ్చు. అది నా పక్షపాత ఆలోచనేమో అని మీరు నమ్మకపోవచ్చు. కారులో మొదట మా ఆవిడే అలా అన్నాదంటే మరి నమ్ముతారా?

ఊరుకో లక్ష్మీ అన్నా వినిపించుకోకుండా, మా ఆవిడ సోది చెప్పుకుపోయింది కారులో. అంతా ఆమె నా స్వప్నసుందరి అని, వసున్నదని తెలిసినప్పటి నుంచీ నాకు నిద్రే లేదనీ వగైరా, వగైరా. సిగ్గుతో ముఖం కందబారింది. రక్షించి వాళ్లు వెనుక సీట్లో కూర్చున్నారు కనుక సుశీల అది గమనించి ఉండదనే అనుకున్నా.

"ఒక్కరే వచ్చారు. మీ ఆయనా పిల్లలు రాలేదేం? వస్తే ఇంకా సంతోషమయ్యేది" అన్నాను భోజనం చేస్తూ.

"మాకింకా పిల్లలు లేరు. మా గొడవ చెప్తాను సావకాశంగా"

ఆ సమాధానం విన్నాక మా అభిప్రాయాలు కనిపెట్టి.

"మా ఇద్దరి మధ్యా ఏ గొడవా లేదు. బెంగ పడకండి. ఉంది చాలా, చెప్పాల్సింది. అలస్యమైపోయిందిప్పటికే. మీరు పడుక్కోండి. రేపు శనివారం శలవే అనుకుంటా మీకు, సావకాశంగా..."

ఆవిడ మాట పూర్తిగా వినకుండానే, మా ఆవిడ.

"నాకు ఉందంటే రోజూ శలవే. లేదంటే ఏరోజు లేదమ్మా. వారికి మేష్టారిగిరీ కనుక ఏదో వారానికి మూడో నాలుగో గంటల లెక్చరయిం దనిపించాక అంతా శలవే" అని తనకేమీ ఉద్యోగం లేదని చెప్పుకోవడమే కాకుండా, నా పనీ ఇంచుమించంతే అన్నట్లు తన అభిప్రాయం వెలిబుచ్చింది. ప్రొఫెసరంటే



అందరికీ చులకనే! చచ్చి చాకిరీ చేసినా నాలుగురాళ్లు ఇంట్లో పడేయలేని అసమర్థుడని.

సుశీల మా ఆవిడ మాటలకి నవ్వుతూ లేచి తన పడకగదికి దారి తీసింది. మరునాడు తీరికగా బ్రేక్‌ఫాస్ట్ కానిచ్చాక, వాషింగ్‌టన్ చూపిద్దామని, ఇదివరలో ఎప్పుడేనా వచ్చేరా, అని సుశీలని అడిగాను. వాళ్లాయన తన కన్సల్టెన్సీ పనిమీద వచ్చినప్పుడల్లా వచ్చానని చెప్పింది. అయ్యో, మేమిక్కడే ఉన్నాం. ఇన్నాళ్లూ. చెప్పారు కాదంటూ, అతిథి మర్యాదగా "సెప్టెంబర్ పదకొండున పెంటగన్ పడగొట్టాక ఎంత పెద్ద దెబ్బ తిన్నాదో, చూద్దురూ కాని, పదండి. అంతా క్లియర్ చేసేసినా ఆ దృశ్యం చూసి తీరాల్సిందే" అని నేననగానే సుశీల ముఖం నెత్తురుచుక్క లేనంత పాలిపోయింది. గజగజ వణికిపోయింది.

కాస్త తేరుకున్నాక, "మీ వాళ్లెవరేనా పెంటగన్‌లో దెబ్బతిన్నారా? ఐతే వద్దు లెండి" అన్నాను.

మెల్లిగా, సుశీల, అతి కష్టంతో మొదలుపెట్టింది.

"ఆ పిశాచ దుర్మార్గానికి దగ్గర వాళ్లెవరూ ఆహుతి కాలేదు. తెలిసిన వారు ఉన్నారు. అసలు, ఓ విధంగా అందరూ మనకు కావలసిన వారే అనిపిస్తుంది. పాపం, వాళ్లేం చేశారని వాళ్లకి, వాళ్ల వారికీ ఆ అన్యాయం?"

"దాని తరువాతే వచ్చింది. మా కుటుంబానికి శని. మీరు వినే ఉంటారు. మాతాత దగ్గరనుంచి. నేను పెళ్లి చేసుకున్నది ముస్లిమునని. మాతాత తప్ప మిగతా వారందరూ నాముఖం చూడరు సరే. మాట్లాడనైనా మాట్లాడరు. అది బాధే కాని, ఇప్పుడు మా బాధ అది కాదు. నేరుగా సెప్టెంబర్ పదకొండు టెర్రరిస్ట్ అక్రమానికి సంబంధించినదే.

"మీకు తెలియనిదేముంది? వాళ్లకి సహాయం చేసేరని కాని, చేసినవారిని తెలుసునేమో అన్నవారిని కాని చాలామందిని, ముఖ్యంగా ముస్లిములని కేసూగీసూ లేకుండా డిటైన్ చేస్తున్నారని. అలా చేసిన వాళ్లల్లో, మాఆయన ఇరుక్కుపోయారు"

అయ్యో, పాపం. అంది మా ఆవిడ, నేను.

"నిజంగా మీ ఆయన వాళ్లల్లో ఉన్నారా?" అని అడిగాను.

నానోట అలాంటి మాట వచ్చినందుకే చాలా నొచ్చుకున్నట్లుంది. కొంచం కోపం కూడా వచ్చిందనుకుంటాను. తమాయించుకుని.

"మీకు మా ఆయన తెలియదు కాబట్టి అలా అన్నారు. మీదాకా ఎందుకూ? అన్ని మతాల వారికీ వలసవచ్చే అవకాశం ఇచ్చి, విభిన్నత్వంలోనే ఏకత్వం ఉందని రెండు వందల సంవత్సరాలై ప్రపంచానికి ఆదర్శంగా ఉన్నా ఈ దేశ పరిపాలకులే ఏమంటున్నారు? ఇది యుద్ధసమయం. ఇప్పుడు వ్యక్తిగత హక్కులని, టెర్రరిస్ట్‌లు మన చట్టాల లొసుగులలో దాగుకునే సమయం కాదు అని ఎవరిని అనుమానిస్తున్నారు? కొత్తగా వచ్చినవాళ్లే కాకుండా, ఇక్కడ నమ్మకంగా యేళ్లాయి ఉన్న విదేశ ముస్లిములనే కదా?

"మా ఆయన పనిమీద ఇతర దేశాలు తరచుగా వెళ్తూ ఉంటారు. అందులో తను ముస్లిం కనుక, వాళ్ల కంపెనీ అమెరికన్ కంపెనీనే ఐనా, వ్యాపారానికి నప్పుతుందని, ఎక్కువగా ముస్లిం దేశాలకే ఆయనని పంపేవారు.

"ఇంకా ఓ ఏడాది ఉంది. మేం సిటిజన్‌షిప్‌కి అర్జీ పెట్టుకోడానికి. అందుకే మా ఆయనలాంటి వాళ్లని అనుమానించి తీసుకుని వెళ్లిపోతున్నారు. మాఆయన నిర్దోషి కాబట్టి, తప్పకుండా విడుదలైపోతారు. కాని అంతవరకూ తప్పదు మాపాట్లు" అని అప్రయత్నంగా కళ్లంట నీరు పెడ్తూ ఊరుకుంది.

"ఊరుకో అమ్మా, కష్టాలు కలకాలం ఉండవన్నారు" అని మా ఆవిడ సముదాయించింది.

"ఇప్పుడు గడవడానికి సొమ్మేమేనా అవసరమా?" అని నేనన్నది వినగానే సుశీల నామాట అర్థం కాలేదన్నట్లు, ఆశ్చర్యంగా అలా శూన్యంలోకి రెప్ప వాల్చకుండా చూస్తూ ఉండిపోయింది.

"మీరూరుకోండి. మీకేమనాలో తెలిసి చావదు" అని నన్ను మందలిస్తూ, సుశీలతో "ఆయనంతే నమ్మా. అది మనసున పెట్టుకుని బాధపడకు. చెప్పమ్మా. మీ ఆయనని చూడనిస్తున్నారా? ఆయనని కొట్టి, గిట్టీ, ఏం చేయడం లేదు కదా? మీరు ఉండేది ఏ ఊరన్నావు? అక్కడ ఇంకెవరైనా మనవాళ్లు ఉన్నారా? మీ ఆయన కంపెనీ వాళ్లేమంటున్నారు?" అని మా ఆవిడ నెమ్మదిగా, నాగొడవ మధ్యమధ్యలో అవసరం లేదన్నట్లు నావైపు చూసి, సుశీలని ప్రోత్సాహించింది.

"మాకు సొమ్ముకి ఏ ఇబ్బందీ లేదు. మా ఆయనని కలియనివ్వలేదు కాని ఫోన్‌లో ఆయనని మాట్లాడనిచ్చేరు. ఆయనని ఏమీ చేయడం లేదుట. అవేమీ కానే కాదు. నేనిలా మీ దగ్గరికి రావడానికి."

"నేను ఎమ్మే చదువుకున్నా. ఉద్యోగం చేయనవసరం ఉండేది కాదు. నాపని ఆయనతో దేశాలు తిరిగి ఆనందించడమే. అది నాకూ సరదానే కనుక నేను చేస్తానని అననూలేదు. ఐనా మళ్లీ ఇక్కడే ఏదో చదువుతేనే కాని మంచి ఉద్యోగం ఏం వస్తుంది లెండి."

"పైపైకి సానుభూతి చూపిస్తారు. కంపెనీవారు కాని వాళ్లకి మాతో, ఈ గొడవ నుంచి మా ఆయన బయటపడేదాకా, ఎంత తక్కువ సంపర్కం పెట్టుకుంటే అంత మంచిదన్నట్లు ఉంది."

"మేం ఉండేది బోస్టననే చెప్పుకోవచ్చు. ఆ దగ్గరలో ఓ చిన్నపల్లె. మీకూ అదే అనుభవమై ఉండాలి. ఆఫీసులో ఈదేశంవారితో చాలా చనువుగా కలసిమెలసి పనిచేసినా, సాంఘికంగా ఎక్కువమంది వాళ్ల వాళ్ల ప్రాంతం నుంచి, అందులోనూ, బహుశా



వాళ్ల ప్రాంతమో, కులమో, శాఖో, చూసి మనవాళ్లు కలుస్తారు. ఉంటూన్న వీధిలో అమెరికన్లతోనైనా కలిసేది అరుదే.

"ఎక్కువగా మేం ముస్లిములతోనే తిరిగాము. మనవాళ్లతో నేను కలుద్దామన్నా. నేను ముస్లిమ్ అనగానే ఎంతమంది మనలో నాతో వచ్చి స్నేహం చేసుకుంటారు? ఇంకా అమెరికన్లతో కలియడానికి వెనుదీయకపోవచ్చును కాని, ముస్లిం అనగానే అమ్మో అని వెనక్కి వెళ్లేవారే చాలామంది."

"ఇప్పటి పరిస్థితి ఎలా వచ్చిందంటే, ముస్లింలకి కూడా మాతో చనువుగా కలియడం భయమే. మా ఆయన గురించి నిజంగా వాళ్లకేం తెలుసును? ఈ దేశం వచ్చి సొమ్ము చేసుకుంటున్నాడు. మంచివాడులాగే ఉన్నాడు. అని తప్పా?

"పోనీ ఇండియా వెళ్లు కొన్నాళ్లకి అన్నారాయన. అక్కడ మాఆయన వారు హైదరాబాద్‌లో చాలామంది ఉన్నారు. నేవెళ్తే ప్రాణం పెట్టి చూసుకుంటారు. అక్కడే అమ్మా, నాన్నా, మా చుట్టాలూ, చాలామంది ఉన్నారు. వాళ్లతో మా ఆయనవాళ్లు కలియరు కదా! వాళ్లు కలుద్దామన్నా మా అమ్మావాళ్లూ ఒప్పుకునేదీ లేదు. అదో నరకం నాకు.

"తాతయ్య ఉండి ఉంటే హాయిగా అక్కడ ఉండి ఉందును. పోయి ఏడాది అయింది. నేస్తాలు బయట బాగా మాట్లాడుతారు కాని, వాళ్లింట్లో ఉంచుకోవడాని కంటే అత్తామామలతో కాకుండా వాళ్ల మానాన్న వాళ్లతేనే యేమో?

"అందుకనే ఆలోచించి మీ దగ్గరకు వచ్చాను. చిన్ననాటి కృష్ణమూర్తిని తలచుకుంటూ" అని మాకేసి సూటిగా చూస్తూ, తను చెప్పవలసింది మరేమీ లేదన్నట్లు.

"మంచి పని చేశావమ్మా. దానికేం భాగ్యం" అని మా ఆవిడ చులకనగా అనేసింది. నేను అంత సులువుగా, అదో ఇబ్బందిలేని మాట అని అనలేకపోయాను.

అంటే, మాకు మరో మనిషి ఉండడంతో ఏ ఇబ్బందీ లేదు. మామూలుగా. కాని, ఏమో, అతనో అతివాద ముస్లిమైతే గియ్యే. ఈమెకి ఆ విషయాలు తెలిసి రేపోమాపో ఈవిడనీ పట్టుకున్నప్పుడు, వాళ్లని చేరదీసి సహకరించేమని మాకూ అనవసరంగా... అన్న ఆలోచనలతో.

రక్షించి సుశీల ఇది గ్రహించినట్లు లేదు.

"లక్ష్మిగారూ, మెనీ థాంక్సండీ. కృష్ణమూర్తి గారంటే సరే. చిన్ననాటి స్కూల్ సహాధ్యాయులం. కాని మీరు కాదుకదా. అందుకని మీరు కూడా అంగీకరిస్తారా అన్న అనుమానం లేకపోలేదు. పొద్దుపోయింది పడుక్కుందాం" అని చిరునవ్వుతో లేచి, తన పడకగదికి వెళ్లిపోయింది.

మెల్లిగా లేచి మా గదికి వెళ్లాక మా ఆవిడకి నా భయాలు చెప్పుకున్నా.

"కొండంత ఆశ పెట్టుకుని వస్తే, మీ సహాధ్యాయురాలికి మీరు చూపే అతిథి సత్కారం ఇదా, నేనే అలాంటి తికమకలో ఉంటే నా చిన్ననాటి పరిచితులు మీలాగే నన్ను ఆదుకోకపోతే మీరేమందురు?" అని ఆ చెంపా ఈ చెంపా వాయగొట్టి నిద్రపోయింది. అంతటితో డిస్కషన్ క్లోజ్ అన్నట్లు.

పొద్దున్నే కాఫీటేబుల్ మీద చీటీ ఉంది. సుశీల తెల్లవారగానే మాకు చెప్పకుండానే వెళ్లిపోయింది. చీటీలో....

"పారవద్దాను. వచ్చి మీకు ఇబ్బంది పెడ్తున్నా అన్న ఆలోచనే లేకపోయింది. క్షమించాలి. సానుభూతితో నాగోడు విన్నందుకు కృతజ్ఞురాలిని. సుశీల" అని క్లుప్తంగా.

■